
# కబోది



కేవశ్వ

—బాబూ పైసా .... బాబూ పై ....
బాబా పైసా దరమం ...

—దరమ తల్లీ....అనాదివాల్లం... బోది వచ్చేలం తల్లీ....

—గుడ్డోన్ని బాబో దరమం సెం యండి.

—గోయిందా....గో-యిందా.... రమం తల్లీ....వొక్క పైసా బాబో....

గోపురంకింద ముష్టిజనాభా. గోల ముష్టి పాత్రల్లో చప్పుడు—'పైచాలు'.

—కుంటిముండా నీ చీటు కో టికాడ గదే....యీడికెందు కొచ్చినావ్?....

—వోరూ? వోర్రా? సవేత్తిరా? వేత్రీ!

—అవున్రా గుడ్డినాయాలా! -సవేత్తిర్నే....మావోడు గనిపిచ్చినాడా .తెల్లార్నించీ కోనేటికాల్లేడు....యీడికటో నాడో ....యిక్కడిగ్గా వొచ్చినాడా?

—వోపెర్రిముండ .... కబోదిగ .... అన్నడుగుతావేందే?....తెల్లార్నుంచి న్నే వుండాన్నేను....నీ సొట్టేడీ పక్క ా.... యేందే?....తన్నుకున్నారా?....

—లే .... లే .... బ్రెమ్మోచ్చం చా.... అలిపిరికాడికి బోదామన్నాడు .... డైతే పైచాలు బాగా బడతాయంట....నే ా.... వొద్దన్నాను....రాత్తిరి....ఆడిగ్గాని యినా డేమో....నేబోతా....

—వొసే సొట్టముండా .... దెప్పు దొస్తాదే యింక?....కోనేటికాడికి నన్ను గాన్రమ్మంటావేంటే .... దీపాలు పెట్టేత్తా వుండారు....ఆ(....వొచ్చేదా....

—పోరా....ముసిల్నాయాల.... వ్రలాడ గొడ్తా....ఏమనుకున్నావో....ఆ(....

సొట్టది—వెళ్ళిపోతోంది.

—సొట్టగుంటే వుందిగాని.... త్తిరి....

—సవేత్తిరి .... యెల్‌పోతావు ా ....
సవేత్తిరీ .... సవేత్రీ!....

....వోర్....యేంటి కరస్తావు కబోదిగా....యెల్‌పోతావుందది.... నెల్దినా ప్పుడు యెడం దవడ పల్లు రాలగొట్టిచ్చుకునింది సాల్దారా....యింకా దానిమా టెందుకు నీకూ? ....కల్లెట్టాలేవు....పల్లూపోతే....అ క్కనే దానికి నోటమ్మిట మాటన్నా యెల్ ాదు.... గో-యింద! దరమం తండ్రా!... దరమం ....గో-యింద .... ముసిలోన్ని ాబో.... నేనడిగితే ఆడికేత్తన్నారు బాబో....ోర్.... కబోదిముండకొడక....నీపనే బాగుందిరా.... పైచాలంతా నీకే పడతావుండా ..

పైచాలు పడతాయి. నిజమే, ోపురం దగ్గర....నిలుచున్నా—కూచున్నా-గొంతెత్తి అరవకపోయినా .... గుడ్డివాడు కాట్టి — పైచాలు బాగానే పడతాయి.

పుట్టుగుడ్డి అయినా-పొట్టనిండటం కష్టం కాదు. కాని—

సవేత్తిరి?

పుట్టి—చూపెరగడు కబోది. కాని-అద దాన్నెరుగును. మొదటిసారి—పూరవతల-పాడుబడిన గుడివెనక వేపు — నడివయసు ముష్టిది. ఆ తరువాత—చెత్తకుండీ వెనక-ఎవరో గుడ్డి ముష్టిది.

కబోది వాడి ప్రేయసులు-ఎలావుంటారో-తెలీదు వాడికి.


చేతుల్తోనే చూట్టం.

మనసులో—బొమ్మలు.

వొకసారి — చలిరాత్రి-టెంటు సినిమా వెనుక కుప్పల్లో—ఆత్రంగా వాటేసుకుంది-పొంకంగా వున్న ఆడది—కాని-ముఖం తడిమితే—కుష్ఠుది—తోసిపారేశాడు— ఛీ!

ఎక్కణ్నుంచి వొచ్చిందోగాని— వొచ్చి రాగానే ముష్టి జనాభా కంతటికీ తెలిసిపోయింది—సావిత్రి. ఎడంకాలు సొట్ట. ఈడుస్తూ నడుస్తుంది. కాని-భలే వుంటుంది-ట! చింపిరోడూ - యింకో కుంటోడూ వర్ణించి చెప్పగా విని-మహా యిదైపోయాడు కబోది. భలే వుంటుంది.

—స్తానంగీసం చేపించి కొత్తకోకని కట్టబెడితే....చినేమాయిష్టారులాగుంటాది....




....నెల్లూర్లోనో యానో్న....మిలిటీ వోటల్ దగ్గిర పుల్లాకులు పీక్కుతినేదంట....అందు ....యెట్టుందో సూడా వొల్లు....వాహ్....

విన్నవెంటనే మనసు పడ్డాడు కబోది అది కోనేటి దగ్గిర వుంటుందని తెలి: అక్కడి కెళ్ళాడు. మంచి సెంటరే. రెండ బస్స్టాండ్లూ .... రైల్వే స్టేషనూ దగ్గిరే పైచాలూ బాగానే పడతాయి.

పలకరిస్తేనే కస్సుమంది సవేత్రి.

—నేన్నితో వుంటానే....ఈన్నే అడక్కుంటా .... కబోదిగాన్ని గదా....నాక యీడున్నా పైచాలు బాగా పడతాయి... సవేత్తిరీ....నాను శానా మంచోన్ని....నిన్ను నెత్తిన బెట్టుకుంటా....

కబోది మాటల్ని ఖాతరు చెయ్యకపోగా. అంతెత్తున లేచింది సవేత్రి.

—పల్రాలగొడ్తా దొంగనాయాల .... ముకంసూడు దొంగముకం .... యామనకున్నావ్రా నేనంటే .... అంత తేరగా వుండారా ఆదోల్లు .... యెవుతన్నా కుష్టముండన్నూసుకోరా గుడ్డినాయాల....నీ దగ జాకు సవేత్రే కావాల్సొచ్చిందా....

తన్నకనే 'తన్ని తగలేసింది.' ఇంకా మాట్లాడుంటే తన్నేదే కబోదిని.

—పొగురున్న ఆడదే ఆడది

అనుకున్నాడు కబోది. కోరిక ఎక్కువైంది. కాని-ఎన్నిసార్లు ప్రయత్నించినా—లొంగిరాలేదు. ఆలోగా—

ఏం మాయజేశాడోగాని-సొట్టో డొకడు లోబరచుకున్నాడు — దాన్ని. దుక్కలా వుంటాట్ట. ముగ్గుర్ని తంతాట్ట. వొకసారి నిజంగానే తన్నేట్ట-ముగ్గుర్ని!

—మనిషినేగాని మనసు జూడవా సవేత్రి....

అనుకున్నాడు కబోది.

(సినిమాలు చూడడు కబోది. ఏదో బంకు దగ్గిర వొక సినిమా మాటల 'రికార్డు' విన్నాడు.)

—గోయిందా....నారాయనా.... దరమం తండ్రే....

రాత్రయింది.

—ఏరా కబోదీ...బువ్వకు బోదామా?...

ముసలోడి ఆసరాతో—లేచాడు కబోది.

పైచాలు ముష్టెత్తే వాళ్ళు-అన్నం ముష్టెత్తరు! మర్రిచెట్టు దగ్గిరికొక నడివయసు వాడు గంపలో అన్నం తెస్తాడు. అర్ధరూపాయిస్తే ఆకులో అన్నం పెడ్తాడు. పులుసు పోస్తాడు.

నడుస్తూ అడుక్కుంటూనే వున్నాడు ముసిలాడు. ముష్టి 'బోకి' ముందుకి చాచి నడుస్తున్నాడు కబోది. అప్పుడప్పుడూ అందులో పైచాలు పడుతున్నాయి.

ఇద్దరూ చెట్టు దగ్గిరి కెళ్ళారు. మామూలుగా తిన్నారు. అయితే—కబోదికి మనసు మనసులో లేదు.

కోనేటి దగ్గిర సవేత్రి! సొట్టోడు తెల్లవార్నుంచి కనిపించలేదు! వొక్కత్తే వుంటుంది సవేత్రి!

వున్నట్టుండి గాలి దుమారం, బజారంతా సందడి. వాహనాలు వేగంగా పరుగెడ్తున్నాయి.

—వొరే ముసిలోడా....గోపురంకాడికి నువ్ బోరా....నేన్రాను.

అన్నాడు కబోది.

ముసిలోడు అసాధ్యుడు—

—ఆ రాండో దవడ పల్లెందుకురా రాలగొట్టుకుంటావ్....అదొట్టి తిక్కముండ ....దాంతో నీకెందుకు....యెల్ పోదాంరా ....అసలే వానొచ్చేట్టుగా వుంది....

దొరికిపోయిన దొంగలా అయిపోయాడు కబోది. అయినా — మంకుపట్టు వొదల్లేదు.

—పోతే—నా పల్లుబోతాయి....నువ్వు బోరా ముసిలోడా....

గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు ముసిలాడు. కర్ర టక్కు టక్కు లాడిస్తూ ఎడం చెయ్యి జాపి ఎదురొచ్చే మనుషుల్ని కాచుకుంటూ తడుముకుంటూ కోనేటివేపు నడిచాడు కబోది.

నిజమే!

నెర్లోజులప్పుడు వొకరాత్రి మళ్ళీ మాట్లాడాడు సవేత్తిరితో. ఈసారి బాగానే మాట్లాడింది. సొట్టోడులేడని—మీద చెయ్యేశాడు. అంతే-దవడపళ్ళు-రెండు రాలిపోయాయి— అప్పుడే-అక్కడికక్కడే....

అయినా-అంతగా కసిరే ఆడది—కొట్టే ఆడది—కనికరిస్తే—ఎలా వుంటుంది?

తహతహగా వుంది కబోదికి.

—సస్తాను. అదికాదంటే సచ్చిపోతాను —అంతే—ఈరేత్తిరి కాదంటే....నిజ్జంగా సచ్చిపోతాను....

గాలి రేగుతూనే వుంది: సవేత్తిరి ఎక్కడుంటుందో తెలుసు కబోదికి. కోనేటి మెట్ల దగ్గిర—బస్స్టాండు దారి మలుపు దగ్గిర—వుంటుంది. అక్కడ—ఈవేళకి బంకులు మూసేస్తారు. దీపాలుండవు-ట. (కబోదికి తెలీదు.) ఆ బంకుల వెనకే-సవేత్రి సొట్టోడితో కాపరం.

—సవేత్తిరీ....సవేత్రీ....

—ఏరా కబోది....ఏమిట్టొచ్చినావ్?

—వూర్కేనే..... అందామనుకుని— అన్లేదు. గమ్మున మెట్లమీద కూచున్నాడు. చటుక్కున అతనికో దారి కనిపించింది. మాట్లాడకూడదు. ఇవాళ సవేత్రితో మాట్లేమీ మాట్లాడకూడదు. అర్థంచేసుకుంటుందా— సరి. లేదా-పోసీ. తను చచ్చిపోతాడు. నిజంగా చస్తాడా? అంత 'దయిర్నం'

వుందా? సవేత్రి ఈ రాత్రి—కాద. ఏ— జన్మలో దాని ముఖం చూడకూడదు. ఛస్. ఎలాగూ తను చూళ్ళేడుగా! దాని తన ముఖం చూపకూడదు!

—ఏరా కబోది.... బువ్వ దిన్నా ?....

తిన్నానన్నట్టు, తలూపేడు.

—వానొస్తుంది — బిన్నా ల్ పో గోపరం కాడికి....

మాట్లాడలేదు.

—నేను బన్ రొట్టి దిన్నా... అన్నం తిన్నీ పూట... ఆడింక రాడేమో....

తలొంచుక్కూచున్నాడు కబోది. ఎప్పుడు బాగానే మాట్లాడుతుంది సవేత్రి. ఎంతసేపైనా మాట్లాడుతుంది. కొత్తసైతే మాత్రం-తంతుంది. నిజంగానే తంతుంది.

విసిరికొడుతున్న గాలితోబాటు చుకుచుకు పడింది వాన. గోనెపట్టా చిరుగుల బొంతల మూటా తీసుకుని బంకుచాటుకి పరుగెడుస్తూ వెళ్ళింది సవేత్రి.

వారే కబోదినాయాల.... పెద్దోనా ...జర మెచ్చి వస్తావ్ .... వొచ్చెయ్. బిన్నా వొచ్చెయ్....

కదలకుండా మెట్లమీదే కూచున్నాడు కబోది. వాన బాగుంది. వొళ్ళు వెక్కుతోంది.

ఈడ్చికొడుతోంది వాన. ఫెళ ఫెళ మని వురుము. తళుక్కున మెరుపు (కబోది కళ్ళబడలేదది.)

—ఏమ్మెరుపుర్రా కబోదీ

అంది సవేత్రి. —అమ్మో!

అక్కడెక్కడో పిడుగు.


—వోయమ్మ....పెద్ద వోనొస్తాంది ....రారాపోదాం....

వులిక్కి పడ్డాడు కబోది. చెయ్యపట్టుకుంది సవేత్రి. లేవదీస్తోంది.

—యాడికి?—. అన్నాడు.

—బ్రిడ్జికాడికి పోదాంరా....వోనకి యీ బంకు దగ్గిరుండలేం—పద—బిన్నా లెయ్....

చెయ్యి పట్టుకుని లాక్కెళ్తోంది సవేత్రి, అడుగూ, అడుగులో-అడుగూ, నడుస్తున్నాడు కబోది. తగ్గినట్టేతగ్గి లాగి లాగి కొడుతోంది వాన. పొట్టకాలు ఈడుస్తోంది సవేత్రి. ఆ శబ్దం—వికారంగా వున్నా—భరించుకో కబోది. సవేత్రి చేతిలో-తన చెయ్యి. ఎదు లేమిక్కారు.



—జేగర్త గుడ్డినాయాలా....కర్రీలు.... జేగర్త....

రైలు పట్టాలు దాటేరు. ఏదో లోకాని కెళ్తున్నట్టుంది కబోదికి. కంకర రాళ్ళు.... ఇసక....బొగ్గులు....

—వోన్నిల్చిపోయిందా?....

—నీ తలకాయ-బ్రిడ్జికింది కొచ్చినాం....

దూరంనుంచి గంట గణగణా మోగింది. కూతపెట్టి రైలు కదిలింది. శబ్దం దూరమై పోయింది.

బ్రిడ్జి మెట్లకింద-వొకవారగా-మూలగా— గోనిపట్టా పరుచుకుంది సవేత్రి. గుడ్డపేలికల మూటవిప్పి పరుచుకుని- స్తంభానికి ఆనుకుని కూచున్నాడు కబోది.

ఏదో సినిమా పాట—వెర్రిగా గొంతెత్తి పాడి-సగంలో ఆపేసింది సవేత్రి. ఏవో కబుర్లు చెప్పబోయి మానేసింది. వులక్కుండా పలక్కుండా కూచున్నాడు కబోది. మత్తుగా నిద్ర. బ్రిడ్జిమీద అడుగుల చప్పుడు వినిపించటంలేదు. వానపడే శబ్దం—చిటపటమని.

—వారే గుడ్డినాయాలా .... గుంజకాను కునే కునికేసినావా....

వినిపించుకున్నా, పలకలేదు కబోది.

—నాకు నిద్రొస్తాంది....

ఆవలించింది సవేత్రి. కొంతసేపటికి సన్నటి గురక. తడుముకుంటూ వెళ్ళి సవేత్రిని లేపితే? చుట్టూ ఎక్కడా అలికిడిలేదు. ఇంకెవరూలేరు. గోలజేస్తే సవేత్రి? తంతే?

కదల్టానికి శక్తిలేనట్టు అలాగే జోగుతూ వుండిపోయాడు కబోది.

వానకి తడిసిన మట్టివాసన-కమ్మగా.

గాలి—చిరు చలిగా.

గోనిపట్టా కప్పుకుని ముడుక్కున్నాడు.

గుడ్డి కళ్ళని అదుముతూ కమ్ముతూ నల్లటి మెత్తటి—నిద్ర.

లాగినట్టనిపించి—నిద్ర చెడింది. చెయ్యి పట్టి లాగుతోంది—సవేత్రి!

—సవేత్రే....

—వూఁ....రారా....గుడ్డోడా....

కబోదికి వొళ్ళుసారిగా చూపొచ్చేసినట్లయింది.

మెట్లకిందికి లాగింది సవేత్రి—గుడ్డోడా?

—వూఁ....

—వారే....

—వూఁ....

కబోది చేతివేళ్ళకి కళ్ళొచ్చేయి. సవేత్రి వొళ్ళంతా పాకేయి అవి.

—సవేత్రీ....నువ్ బలే వుండావు....

నీళ్ళలో కుండ మునుగుతున్నట్టు నవ్వింది సవేత్రి. అలాంటి నవ్వు కబోది ఎప్పుడూ వినలా. కితకితలుపెట్టి నవ్వించాలనుకుని— ఆ సంగతే మరిచిపోయాడు.

బ్రిడ్జి కూలిపోతున్నట్టు శబ్దం-ఫెళ-ఫెళ-వురుములు....

—ఏమ్మెరుపుర్రా గుడ్డోడా!

అంది సవేత్రి.

—అవునౌను.... మెరుపులు....

* * *

మరుసటిదినం రాత్రి-వూరుమాటు మణిగే వేళకి టక్కు టక్కుమని వొచ్చేడు కోనేటి దగ్గిరికి కబోది. —సవేత్రే...., అని ఎంతో లాలనగా పిలిచాడు.

—నువ్వా గుడ్డినాయాలా....తెల్లార్తోనే మావోడొచ్చేసినాడు....అగ్గో—టీ అంగడి కాడికెల్నాడు...ఎల్లెల్లు...ఏంది నిలబణ్నావ్? ఎల్మంటే నీక్కాదూ!....

—సవేత్రే....

క్రరతో కబోది కాళ్ళమీద వొక్కటేసింది సవేత్రి.

—పోపోరా గుడ్డినాయాలా .... కల్లెట్టా లేవు....కాల్లుగూడా యించేస్తా....మరేదాగా యెల్పో.... □